# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 28-03-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- అమరావతిలో ఐఐటి మద్రాసు సహకారంతో క్వాంటమ్ వాలీ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చెప్పారు.
- ఆయుష్మాన్ భారత్ పథకంలో రాష్ట్రానికి 118 కోట్ల 75 లక్షల నిధులను విడుదల చేసిందని కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ తెలిపారు.
- రాష్ట్రంలో మూడు మైక్రో బయాలజీ లేబొరేటరీలను ఆధునీకరించనున్నట్లు కేంద్ర శాఖ సహాయ మంత్రి ప్రతాప్ రావు జాదవ్ తెలిపారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్ మనసులోని మాట" కార్యక్రమం 120వ సంచిక ఈ ఆదివారం ప్రసారం కానుంది.

===================

అభ్యసనం నిరంతర ప్రక్రియగా సాగాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఈరోజు మద్రాసు ఐఐటిలో నిర్వహించిన అఖిల భారత పరిశోధకుల సమ్మేళనం -2025లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. ఐఐటిల స్థాపన దార్శనిక నిర్ణయమని చెప్పారు. తొలినాళ్లలో ఐఐటిలో చదివినవారు మెరుగైన అవకాశాల కోసం మేధోవలస వెళ్లారని అన్నారు. పారిశ్రామిక ఆర్థిక సంస్కరణల తర్వాత పరిశ్రమలు టెలీకమ్యూనికేషన్ రంగాలలో వచ్చిన మార్పులను వివరించారు. భారతీయ విద్యార్థులు గణితం, సైన్స్, ఇంగ్లీషు అంశాలలో మెరుగైన ప్రతిభ చూపుతున్నారని తెలిపారు. మద్రాసు ఐఐటిలో 25 నుంచి 30 శాతం మంది తెలుగు విద్యార్థులే ఉన్నారని ముఖ్యమంత్రి వివరిస్తూ...

(వాయిస్.. 32 సెకన్లు)-సెట్

అలాగే.. అమరావతిలో ఐఐటి మద్రాసు సహకారంతో క్వాంటమ్ వాలీ ఏర్పాటు చేసి రాష్ట్రాన్ని ఏఐ, డీప్ టెక్నాలజీకి కేంద్ర బిందువుగా నిలుపుతామని చెప్పారు. ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఐటీ విధానం దేశానికే మార్గదర్శకంగా నిలిచిందని అన్నారు. భారత ఆర్థిక వృద్ధిరేటు బాగుందని, యువజన జనాభా భారత్ కు ఉపయుక్తంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చెప్పారు.

===================

ప్రకాశం జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. కనిగిరి నియోజకవర్గ పరిధిలోని పీసీ పల్లి మండలం దివాకరపురం గ్రామంలో రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేయనున్న గ్యాస్ ప్లాంట్ నిర్మాణ ప్రాంతాన్ని ఈరోజు సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రిలయన్స్ సంస్థ రాకతో ఈ ప్రాంతం మరింత అభివృద్ది చెందుతుందన్నారు. రానున్న రోజుల్లో మార్కాపురం, గిద్దలూరు ప్రాంతాల్లో కూడా రిలయన్స్ సంస్ధ గ్యాస్ ప్లాంట్ లను ఏర్పాటు చేస్తుందని మంత్రి తెలియజేస్తూ..

(వాయిస్..26 సెకన్లు)-ప్రకాశం జిల్లా

అనంతరం.. జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ.. వచ్చే నెల 2వ తేదీన రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ గ్యాస్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమానికి వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొన్నారు.

===================

రాష్ట్రంలోని ఐదు ప్రాంతాలలో క్రిటికల్ కేర్ యూనిట్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకంలో 118 కోట్ల 75 లక్షల నిధులను విడుదల చేసిందని కేంద్ర, ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ తెలిపారు. ఈరోజు పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ పథకంలో భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో 23 కోట్ల 75 లక్షల నిధులతో క్రిటికల్ కేర్ యూనిట్ ను ఏర్పాటు చేయనున్నామని, ఏప్రిల్ నెలలో శంకుస్థాపన పనులు చేస్తామన్నారు. వందేభారత్ పథకంలో నర్సాపురం రైల్వే స్టేషన్ ను 25 కోట్లు, తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్ ను 27 కోట్లు, భీమవరం రైల్వే స్టేషన్ ను 32 కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి చేస్తున్నామని, వీటి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని అన్నారు.

===================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గుంటూరు వైద్య కళాశాల, ఆంధ్ర మెడికల్ కళాశాల, ఎస్.వి మెడికల్ కళాశాలలో వున్న మైక్రో బయాలజీ లేబొరేటరీలను ఆధునీకరించనున్నట్లు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాప్ రావు జాదవ్ తెలిపారు. నేషనల్ ప్రోగ్రాం ఫర్ ద కంటైన్‌మెంట్ ఆఫ్ ఆంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (NAP-AMR)లో భాగంగా 14 రాష్ట్రాల్లో మొత్తం 50 ప్రయోగశాలలు ఆధునీకరించనున్నట్లు సహాయ మంత్రి వెల్లడించారు. ఎంపీలు కేశినేని శివనాథ్, మతుకుమిల్లి శ్రీభరత్ లు యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ అభివృద్ధిపై లోక్ సభలో అడిగిన ప్రశ్నకు ఈరోజు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాప్ రావు జాదవ్ లిఖిత పూర్వకంగా సమాధానం తెలిపారు.

===================

విరామం

===================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 120వ సంచిక ఈ ఆదివారం ఉదయం 11 గంటలకు అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

===================

టైలరింగ్ లో ప్రాధమిక శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించామని ఈ శిక్షణలో 75శాతం హాజరు ఉన్నవారికి ఉచితంగా కుట్టుమిషన్లు అందజేస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఈరోజు ఏలూరు జిల్లా నూజివీడు మండలం తుక్కులూరు గ్రామ సచివాలయంలో, నూజివీడు పట్టణంలోని విక్టోరియా టౌన్ హాల్లో టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ లో ఇచ్చిన హామీలతో పాటు ఉపాధి కల్పించడం లక్ష్యంగా ఈ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో కూడా స్కిల్ సెంటర్ ఏర్పాటు చేసి నైపుణ్య అభివృద్ధి చేస్తే ఉపాధి కల్పనకు పారిశ్రామికవేత్తలు రావడం జరుగుతుందని మంత్రి పేర్కొంటూ..

(వాయిస్.. 28 సెకన్లు)-ఏలూరు

అలాగే.. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ఏడు కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టే పరిశ్రమలను తీసుకురావడం జరిగిందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు.

===================

ప్రజా సంక్షేమమే పరమావధిగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. చిత్తూరులోని మహాత్మా జ్యోతిరావ్ పూలే భవన్ లో విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 301మంది దివ్యాంగులకు సహాయ ఉపకరణాలను మంత్రి ఈరోజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజా వేదిక ద్వారా ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజాక్షేత్రంలోనే ఉంటున్నారని చెప్పారు. తొమ్మిదినెలల్లో ఊహించని అభివృద్ధిని చేసి చూపించామన్నారు.

===================

ఆంధ్రప్రదేశ్ న్యాయ సేవా సాధికార సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాకుళం జువైనల్ జస్టిస్ బోర్డులో పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం ఈరోజు నిర్వహించారు. ప్రథమ అదనపు న్యాయమూర్తి కె.ఎం. జామరుద్ బేగం, లీగల్ కమ్ ప్రొబేషన్ ఆఫీసర్ తలే లక్ష్మణరావు పాల్గొని, చిన్నారులపై లైంగిక నేరాలను అరికట్టడంలో పోక్సో చట్టం ప్రాముఖ్యతను వివరించారు. చిన్నారులపై లైంగిక దాడులు, వేధింపులు, అశ్లీల చిత్రాల నుండి రక్షించడం ఈ చట్టం లక్ష్యమని తెలిపారు. పోక్సో చట్టం ప్రకారం నేరస్తులకు కఠినమైన శిక్షలు ఉంటాయని, నేర తీవ్రతను బట్టి జైలు శిక్ష, జరిమానాలు విధిస్తారని, తీవ్రమైన లైంగిక వేధింపుల కేసుల్లో మరణశిక్ష విధించే అవకాశం ఉందన్నారు. చిన్నారులపై లైంగిక వేధింపులను అరికట్టేందుకు సమాజం మొత్తం కలిసి పనిచేయాలని, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని న్యాయమూర్తులు పిలుపునిచ్చారు.

===================

ఉపాధి కల్పన పథకంలో భాగంగా ఏలూరు జిల్లాలోని మైనారిటీ వర్గాలైన ముస్లిం, క్రైస్తవ, జైన, సిక్కు, బౌద్ధ మరియు పార్శీ వర్గాల నుండి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి ఎన్.ఎస్.కృపావరం ఈరోజు తెలిపారు. 18 సంవత్సరాలు పైబడి వయసు కలిగిన మైనారిటీ అభ్యర్థులు www.kivconline.gov.in వెబ్ సైటులో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

===================

===================